క్లుప్తంగా

ఆన్‌లైన్ మోసం

శాంతినగర్: గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బండి కంతు కట్టాలని, లేని పక్షంలో మోటార్ సైకిల్ సీజ్ చేస్తామని హెచ్చరించాడు. దీంతో ఆన్‌లైన్‌లో నగదు పంపి మోసపోయిన ఘటన వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. నారాయణగౌడ్ మూడేళ్ల క్రితం శాంతినగర్‌లోని షోరూంలో మోటార్‌సైకిల్ కొనుగోలు చేశాడు. ఫైనాన్స్‌లో కంతుల ప్రకారం లావాదేవీలు జరుపుతున్నాడు. ఈ క్రమంలో తాము మహబూబ్‌నగర్ నుంచి ఫోన్ చేస్తున్నామని, 7780273083 బండి కంతు చెల్లించాలని, లేదంటే సీజ్‌చేస్తామని ఒత్తిడి తేవడంతో వారు తెలిపిన 9700770567 నంబర్‌కు ఆన్‌లైన్‌లో రూ.2600 పంపాడు. రెండు మూడు రోజుల నుంచి వారు మాట్లాడిన నంబర్‌కు ఫోన్ చేస్తే ఎవరు లిఫ్ట్ చేయకపోవడంతో తాను మోసపోయినట్లు తెలుసుకున్నాడు. ఈ విషయమై శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రాజోళి మండలంలో వేరే గ్రూపువారు రూ.40 వేలు ఇలాగే మోసం చేశారు. ఇలాంటి మోసాలకు గురికాకుండా ప్రజలు, యువకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు.

పోలీసుల తనిఖీ



అలంపూర్ రూరల్: మండలంలోని ర్యాలంపాడ్ సమీపంలోని తుంగభద్ర నది బ్రిడ్జ్ చెక్‌పోస్టు దగ్గర బుధవారం సీఐ రాజు ఆధ్వర్యంలో ఎస్ఐ మడుగు రమేష్ పోలీస్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పంపుతున్నారు. వాహనాల్లో మద్యం, డబ్బు సరఫరా కాకుండా పకడ్బందీగా తనిఖీ చేస్తున్నారు. చెక్‌పోస్ట్ దగ్గర సీసీ కెమెరాలు, సెంట్రల్ ఫోర్స్ ఎన్నికల వరకు ఇక్కడే విధులు నిర్వహించనున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

బల్గెర చెక్ పోస్టు తనిఖీ

గట్టు: తెలంగాణ–కర్ణాటక సరిహద్దులోని బల్గెర చెక్ పోస్టును బుధవారం తహసీల్దార్ ధనుంజయ్ తనిఖీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కర్నూలు–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి బల్గెర దగ్గర చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. కర్ణాటక నుంచి తెలంగాణలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెక్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తహసీల్దార్ సూచించారు. ఆయన వెంట సినియర్ అసిస్టెంట్ తిరుమలేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక నిఘా అవసరం

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్ యార్డులో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లకు ఎన్నికల సమయంలో వాహన తనిఖీలు, చెక్కింగ్‌లు, ఇతరాత్ర వాటిపై ఆర్డీఓ చంద్రకళ ప్రత్యేక సూచనలు చేశారు. బుధవారం అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి మండలంలో ఫ్లైయింగ్ స్క్వాడ్స్, అధికారులు ప్రత్యేక నిఘాతో ఉండాలని సూచించారు. మొత్తం 30 మంది అధికారులు వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. వాహనాలు సరిపోవడం లేదని, పెద్ద వాహనాలు ఏర్పాటు చేయాలని అధికారులు ఆర్డీఓకు విన్నవించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆమె పేర్కొన్నారు. ప్రతి చోట బూత్‌లెవల్ అధికారుల వివరాలు తప్పక ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సమాచారం తెలుసుకోవాలన్నారు. రాజకీయ నాయకుల వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు.

మహిళ ప్రాణం కాపాడిన పోలీసులు

ఎర్రవల్లిచౌరస్తా: కుటుంబ తగాదాలతో వివాహిత జీవితంపై విరక్తి చెంది బుధవారం కృష్ణా నదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. స్థానికంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఆమెను కాపాడారు. ఎస్ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. వనపర్తి జిల్లాలోని పీపనగండ్ల మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన సువర్ణ భర్తతో తరుచుగా గొడవలు అవుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆమె బుధవారం రాత్రి బీచుపల్లికి వచ్చి కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఇటిక్యాల పోలీసులు దీనిని గమనించి చాకచక్యంగా వ్యవహరించి ఆమెను ప్రాణాలతో కాపాడారు. అనంతరం ఆమె పూర్తి వివరాలను తెలుసుకొని కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహిళ ప్రాణాలు కాపాడిన పోలీస్ సిబ్బందిని పలువురు అభినందించారు.

గుండెపోటుతో రైతు మృతి



వెంగళనాయుడు(ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: గుండె పోటుతో రైతు మృతి చెందిన ఘటన ఎర్రవల్లి మండలంలోని బీచీపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బీచీ పల్లి గ్రామానికి చెందిన వెంగళనాయుడు (55) ఉదయం పొలానికి వెళ్లి ఇంటికి తిరిగొచ్చాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. అతనికి భార్య పద్మమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

‘డంపింగ్’లో దట్టమైన పొగలు

- గోన్‌పాడులో అనారోగ్యాల బారిన ప్రజలు
- కుక్కల స్వైరవిహారం.. గ్రామస్తులపై దాడి
- పట్టించుకోని పాలకులు, అధికారులు



గోన్‌పాడులో డంపింగ్ యార్డులో పొగలు

గద్వాల అర్బన్: గద్వాల మండలంలోని గోన్‌పాడు గ్రామంలో డంపింగ్ యార్డులో రావణకాష్టంగా మంటలు రగులుతూనే ఉన్నాయి. దట్టమైన పొగ వల్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దుర్గంధం వల్ల వాసన భరించలేకపోతున్నారు. దీంతో గ్రామస్తులు అనారోగ్యాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ విషయంపై అధికారులకు, సర్పంచులకు పలుమార్లు చెప్పినా తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

గుట్టలు గుట్టలుగా చెత్త..

సేకరించిన చెత్తను ఎరువులుగా మార్చాలి. అయితే గద్వాల మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వల్ల పూర్తిగా విఫమైతున్నారు. చెత్తను కాల్చొద్దని నిబంధనలున్నప్పటికీ వాటిని తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. గోన్‌పాడుకు కూతవేటు దూరంలో దాదాపు నాలుగేళ్ల క్రితం డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారు. గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ప్రతి రోజు సేకరించిన చెత్తాను ఈ డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. దీంతో చెత్త పెద్ద పెద్ద గుట్టలుగా పేర్కొనిపోయింది. చెత్తాతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్ చేస్తున్నారు. వీటికి నిప్పంటించడంతో పొగలు అలుముకున్నాయి. 24గంటల పాటు అరని కాష్టంలా మండుతూనే ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి వీస్తున్న సమయంలో దట్టమైన పొగలు ఆ ప్రాంతమంతా కమ్ముకుంటోంది. దీంతో శ్వాసకోశ సమస్యలు తలెత్తడంతో పాటు అనారోగ్యాల బారిన పడుతూ ఆస్పత్రులకు వెళ్తున్నారు. స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నా పొగలు వస్తున్నాయి. ఈ విషయంపై అధికారులు, పాలకులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, అందుకు డంపింగ్ యార్డే కారణమని పేర్కొన్నారు. డంపింగ్ యార్డుకు తాళం వేసి ఆందోళన చేశారు.

కుక్కల స్వైర విహారం

డంపింగ్ యారుల్డో జంతువుల కళేబరాలు తీని కుక్కటు గ్రామస్తులపై దాడి చేస్తున్నాయి. వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ హడలెత్తిస్తున్నాయి. రాత్రి సమయంలో బయటికి రావాలంటేనే భయపడుతున్నారు. నాలుగు రోజుల క్రితం కుక్కలు ఏకంగా ఆరుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఇందులో ఓ చిన్నారి చేతి బోటన వెలు కొరకగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కుక్కలను నివారించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడాలి. అధికారులు చర్యలు తీసుకోని కుక్కలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు..



డంపింగ్ యార్డులో వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. పొగతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. వ్యర్థాలు, జంతువుల కళేభరాలు తిని గ్రామస్తులపై దాడి చేస్తున్నాయి. నా కూతురిని కుక్కలు కర్చి తీవ్రంగా గాయపర్చాయి. ఈ విషయంపై ఎవరికి చెప్పినా పట్టించుకోవడంలేదు. గ్రామస్తులం వెళ్లి డంపింగ్ యార్డుకు తాళం వేసి ఆందోళన చేశాం. అధికారులు స్పందించడం లేదు.

– రాముడు, గోన్‌పాడు

చెత్తను ఎరువుగా మార్చాలి..



డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పు పెట్టకుండా ఎరువుగా మార్చాలి. నిప్పు పెట్టిన చెత్తను ఆర్పడం లేదు. ఊరంతా పొగతో నిండి మనుషులు కనిపించడం లేదు. దగ్గు, జ్వరం, ఆయాసం వంటి రోగాలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ప్రభుత్వాస్పత్రికి సంబంధించిన వ్యర్థాలు కూడా ఈ డంపింగ్ యార్డులో డంప్ చేస్తున్నారు. వందకు పైగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలి.

– ఆంజనేయులు, గోన్‌పాడు

డంపింగ్ యార్డు తొలగిస్తాం..



డంపింగ్ యార్డులో పెద్ద ఎత్తున్న చెత్త పేర్కొనిపోయింది. వారం క్రితం ఎవరో నిప్పంటించారు. అప్పటి నుంచి మంటలు, పొగలు వస్తున్నాయి. నిప్పును ఆర్పి పొగలు రాకుండా చర్యలు తీసుకుంటాం. గ్రామంలో డంపింగ్ యార్డును తొలగించేలా కృషి చేస్తాం. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. ఈ విషయం కలెక్టర్‌కు దృష్టికి కూడా తీసుకెళ్తాం. కుక్కల నివారణకు చర్యలు చేపడుతాం. గ్రామంలో సమస్యల పరిష్కారం కోసమే పని చేస్తున్నాం.

– మాజీద్, సర్పంచు, గోన్‌పాడు

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



మల్దకల్‌లో మాట్లాడుతున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తాటికుంట, నాగర్‌దొడ్డి, మల్దకల్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అంతకు ముందు ఆయా గ్రామాల బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, సీతారామిరెడ్డి, సత్యారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పెద్ద వీరన్న, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చక్రధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటన్న, మధు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

గద్వాల రూరల్: బీఆర్ఎస్ చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన నివాసంలో ధరూరు, మల్దకల్, కేటీదొడ్డి మండలాల ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సత్యారెడ్డి, పటేల్‌ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, అజయ్, సుదర్శన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



గద్వాల రూరల్: బహుజన వాదాన్ని బలపర్చే క్రమంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తుందని, ఇందులో భాగంగానే బీజేపీకి చెందిన మాజీ కౌన్సిలర్లు తుమ్మల నర్సింహులు, భాస్కర్ యాదవ్‌లు కంగ్రెస్‌లో చేరడం మరింత ఉత్సాహాన్ని ఇస్తోందని జెడ్పీ చైర్ పర్సన్ సరిత అన్నారు. బుధవారం ఆమె తన నివాసంలో వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గట్టు, కేటీదొడ్డి మండలాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అమరవాయి కృష్ణారెడ్డి, తిరుపతయ్య, నాగేందర్‌యాదవ్, ఇసాక్ పాల్గొన్నారు.

మెసేజ్‌లను చూసి మోసపోకండి

ఉండవెల్లి: మొబైల్‌లో వచ్చే మెసేజ్‌లు చూసి ప్రజలు మోసపోవద్దని పోలీస్ కళాబృందం సభ్యులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు పలు సూచనలు, సలహాలు చేశారు. బాల్య వివాహాలను నిర్మూలించాలని, మహిళలపై, చిన్నారులపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై షీటీంకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మొబైల్‌కు వచ్చిన మిసేజ్‌లు చూసి రిప్లై ఇస్తే నగదు కాజేస్తున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, పోలీస్ కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

కలగానే.. కల్వర్టుల నిర్మాణం



మానవపాడు-వయా చెన్నిపాడు గ్రామాల మధ్యన ఉన్న వంతెన దాటుతున్న ప్రజలు

- వర్షాకాలంలో తప్పని తిప్పలు
- ఏళ్లు గడుస్తున్నా.. ప్రతిపాదనలకే పరిమితం
- గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం



మానవపాడు - అమరవాయి గ్రామాల మధ్య ఉన్న వంతెనపై పారుతున్న వర్షపునీరు

మానవపాడు: అత్యాధునిక టెక్నాలజీలో కూడా ప్రజలకు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఎన్నో ఏళ్ల ఆశగా ఎదురుచూపులు, కాలం గడుస్తున్నా, నిర్మాణానికి నోచుకోవడం లేదు. మండలంలోని రైతులు, ప్రయాణికులు, వాహనదారులు వర్షకాలం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పల్లెపల్లెకు అనుసంధానంగా ఉండే గ్రామీణ రోడ్లపై వాగులు, వంకలపై వంతెనలు (బ్రిడ్జి) నిర్మాణం లేక ప్రయాణికులకు, వాహనదారులకు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా.. గ్రామాల మధ్య రోడ్లపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండలంలోని పలు గ్రామాల మధ్య ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల రోడ్ల మధ్య ఉన్న వాగులపై వంతెనలు లేక గ్రామాల ప్రజలు ప్రయాణానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షం వచ్చినప్పుడు కల్వర్టు లేని వాగుల వద్ద వరద ఉధృతి వల్ల రాకపోకలు స్తంభిస్తున్నాయి. పాలకులను నిలదీసినప్పుడు మాత్రమే కంటితుడుపు చర్యగా అధికారులకు ఆదేశాల జారీ చేసి మర్చిపోతున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా..

అలంపూర్ నియోజకవర్గంలోని 7 మండలాల్లో కలిపి 124 గ్రామాలున్నాయి. వర్షకాలంలో వంతెనలపై వెళ్లేందుకు ప్రజలు, వాహనదారులు వర్షకాలంలో తిప్పలు తప్పడం లేదు. మానవపాడు మండలంలోని మానవపాడు–అమరవాయి, చెన్నిపాడు–మానవపాడు, అమరవాయి–కలుకుంట్ల, చెన్నిపాడు–పెద్దపోతులపాడు గ్రామాల మధ్య రహదారులపై వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఇటిక్యాల మండలంలోని ఆర్ గార్లపాడు–కారుపాకుల, సనసూలు–శేక్‌పల్లి, శేక్‌పల్లి–ఎర్రవల్లి, ఇటిక్యాల–ఉదండాపురం, గ్రామాల మధ్య వంతెనలు ఏర్పాటు చేయాలి. ఉండవెల్లి మండలంలోని కలుగోట్ల–పుల్లూరు, ఉండవెల్లి–చిన్నఅముదాలపాడు, కంచుపాడు–చిన్నఆముదాలపాడు, వడ్డెపల్లి మండలంలో జూలకల్లు–జూలకల్లు స్టేజీ, రామాపురం–వల్లూరు, కొంకల–వడ్డేపల్లి, రాజోళి మండలంలో రాజోలి–ముండ్లదిన్నె, తుమ్మిళ్ల–మాన్‌దొడ్డి, అయిజ మండలంలో అయిజ–పరదపురం, చిన్నతండ్రాపాడు–అయిజ, అలంపూర్ మండలంలో అలంపూర్–గొందిమల్ల గ్రామాల మధ్య కల్వర్టులు నిర్మించాల్సి ఉంది.

వంతెన నిర్మించాలి



మానవపాడు మండలంలోని అమరవాయి–మానవపాడు గ్రామాల మధ్య వంతెన నిర్మించాలి. వర్షం కురిసిందంటే రాకపోకలు నిచిపోతాయి. కలుకుంట్ల, మద్దూరు, శాంతినగర్, చంద్రశేఖర్‌నగర్ గ్రామాలకు వెళ్లేందుకు అంతరాయం తప్పదు. అధికారులు, పాలకులు చొరవ చూపి వంతెన నిరించాలి.

– బజారన్న, మానవపాడు

10 శాతం పనులు పూర్తి..



ఇటిక్యాల మండలంలోని ఆర్ గార్లపాడు పెద్దవాగు వర్షకాలం ఉప్పొంగి పారుతుంది. దీని వల్ల పదుల సంఖ్యలో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ఆర్ గార్లపాడు వాగుకు నిధులు మంజూరైనా, ఫిల్లర్‌గుంతలు తీసి వదిలేశారు. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి.

– దండు బీసన్న, కారుపాకుల

ప్రతిపాదనలు పంపించాం..

అలంపూర్ నియోజకవర్గంలోని మండలాల్లో ఉన్న వంతెనల నిర్మాణం చేపట్టేందుకు పై అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారులకు నివేదికలు సైతం ప్రాతిపాదించాం. నిధులు మంజూరైతే నిర్మాణాలు చేపడతాం.

– మహేష్, ఆర్ఎన్‌బీ అలంపూర్ ఇన్‌చార్జ్

పోలీస్ బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

కేటీదొడ్డి: ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవడానికి పోలీసులు అండగా ఉంటారని సీఐ శ్రీనివాస్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని కొండాపురం, పాతపాలెంలో కేంద్ర బలగాల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కేంద్రం ప్రత్యేక పోలీస్ బలగాలు రంగంలోకి దిగాయి. ఈ మేరకు ప్రజలకు రక్షణగా తామున్నమని పూరవీధులో కవాతు నిర్వహించారు. ఎస్ఐ నందీశ్వర్, కానిస్టేబుల్ జ్యోతి కాంత్, తులసీరెడ్డి, సీఆర్పీఎఫ్ బలగాలు ఉన్నారు.

ఉపాధి కూలీలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం



కలుకుంట్లలో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

మానవపాడు: మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం ద్వారా పని చేస్తున్న కూలీలకు బిల్లులు చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా చేస్తున్నాయని బీఎస్పీ పార్టీ సినియర్ నాయకులు మహేష్ తెలిపారు. బుధవారం మండలంలోని కలుకుంట్లలోని ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. మూడు నెలలుగా గ్రామంలో పని చేస్తున్న కూలీలకు బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మండల అధ్యక్షుడు శాంతకుమార్, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

కనులపండువగా శోభాయాత్ర

శాంతినగర్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ రామాలయంలో దుర్గా అమ్మవారి శోభాయాత్ర బుధవారం కనుల పండువగా నిర్వహిచారు. రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని ట్రాక్టర్‌పై శాంతినగర్ పట్టణంలోని శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం రాజోళి సమీపంలోని తుంగభద్ర నదిలో అమ్మవారిని నిమజ్జనం చేశారు.



శాంతినగర్‌లో అమ్మవారి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

అంతర జిల్లా తనిఖీ కేంద్రం కోసం స్థల పరిశీలన

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని బీచుపల్లి కూడలిని బుధవారం గద్వాల ఆర్డీఓ చంద్రకళ సందర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ ఎన్నికల దృష్ట్యా అంతర జిల్లా తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమె అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం కోసం బీచుపల్లిలో కూడలిలో అన్ని వసతులు సక్రమంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ నందిని, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.



బీచుపల్లిలో తనిఖీ కేంద్రం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

రాష్ట్ర కన్స్యూమర్ ఫెడరేషన్ ఛైర్మన్ తిమ్మప్ప



ధరూరులో మాట్లాడుతున్న రాష్ట్ర కన్సూమర్ ఛైర్మన్ గట్టు తిమ్మప్ప

ధరూరు: కులాల మధ్య చిచ్చు పెట్టే పార్టీలు, మనుషుల మధ్య తార తమ్యాలు చూపించే వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తున్నారని, చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని రాష్ట్ర కన్స్యూమర్ ఫెడరేషన్ చెర్మన్ గట్టు తిమ్మప్ప, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని జాంపల్లి, ధరూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ చౌరస్తాలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. అనంతరం బొడ్రాయి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి, జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వరరెడ్డి, మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు డీఆర్ విజయ్ కుమార్, సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీలు డీఆర్ శివలీల, దౌలన్న, శ్రీనివాస్‌రెడ్డి, రాజారెడ్డి, వెంకటేష్ నాయుడు, వెంకటేశ్వరరెడ్డి, చిరు,కృష్ణకుమార్డ్డి, రఘువర్ధన్‌రెడ్డి, సుకార్‌రెడ్డి, సంజీవ్, అబ్రహం, సత్యన్న పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడుదాం



ధరూరు: 70 ఏళ్లుగా గద్వాలను ఏలిన ఒకే కుటుంబం ఈ ప్రాతం ప్రజలను వెనుకబాటుకు గురిచేసిందని, ఒక్క చాన్స్ ఇస్తే గద్వాల కోటపై బహుజన జెండా ఎగరేద్దామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్, ఏఐఎఫ్‌బీ బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి ఆయన మండలంలోని మార్లబీడులోని ఆయా కాలనీల్లో ప్రచారం చేశారు. బడుగు బలహీన వర్గాన్ని బల పరచాలని కోరారు. ప్రజల ఆకాంక్ష అయిన విద్య, వైద్యం, సంక్షేమం సాధ్యం కావాలంటే రాజ్యాధికారంతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు బుచ్చిబాబు, లవన్న, గోవిందు, పరుశరాం, వెంకట్రాములు, ధర్మన్న, కర్రెప్ప, వాసు, ఆంజనేయులు, విష్ణు, ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

పోలీస్ బలగాల ఫ్లాగ్ మార్చ్

గట్టు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పోలీస్ బలగాల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. బుధవారం గట్టు, మాచర్ల, బల్గెర గ్రామాల్లో ఐటీబీపీ పోలీస్ బలగాలతో కలిసి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ నందికర్‌లు ప్రధాన వీధుల గుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



బల్గెరలో ఫ్లాగ్ మార్చ్ పోలీస్ బలగాలు

234 లీటర్ల కల్లు స్వాధీనం

శాంతినగర్: ప్రభుత్వ అనుమతి లేకుండా కల్లు విక్రయిస్తున్న దుకాణంపై మహబూబ్‌నగర్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 234 లీటర్ల కల్లు స్వాధీనం చేసుకున్నారు. మహిళను అదుపులోకి తీసుకున్న ఘటన వడ్డేపల్లి మండలంలోని జిల్లెడుదిన్నెలో బుధవారం చోటుచేసుకుంది. జిల్లెడుదిన్నెలోని దుకాణంలో అనుమతి లేకుండా 234 లీటర్ల కల్లు ఉంది. మహబూబ్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేశారు. మహిళ రేవతిని అదుపులోకి తీసుకున్నారు.